# ప్రపంచంలో 'సాలార్‌జంగ్ మ్యూజియం'కు ప్రత్యేక స్థానం

## - మాజీ మంత్రి పి.వి.రంగారావు

చార్మినార్, జూన్ 13 (ప్రభాతవార్త)

సాలార్‌జంగ్ మ్యూజియం ప్రపంచ స్థాయిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని మాజీ మంత్రి డాక్టర్ పి.వి.రంగారావు అన్నారు. గుంటూరు జిల్లా నర్సారావుపేటకు చెందిన ఇంజనీర్ నాయిని నర్సింహమూర్తి అట్లాంటిజనియం దేశం నుంచి తీసుకువచ్చిన బంగారు నాణాన్ని డాక్టర్ పి.వి.రంగారావు సాలార్‌జంగ్ మ్యూజియంకు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలార్‌జంగ్ మ్యూజియంలో ఎంతో సుందరమైన కళాఖండాలు ఉన్నాయని. సాలార్‌జంగ్‌లు దేశ విదేశాల నుంచి సేకరించిన వేలాది కళాఖండాలను నేడు మనం మ్యూజియంలో చూడగలగుతున్నామని అన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం దివాన్‌దేవిడి ప్రాంతంలో ఉన్న సమయంలో 1961లో తన తండ్రి మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి. నర్సింహారావుతో కలసి సందర్శించినట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నలభై నిమిషాల పాటు మ్యూజికల్ క్లాక్‌ను తిలకించి ఎంతో అనుభూతికి లోనయ్యానని ఆయన వెల్లడించారు. నాగ్‌పూర్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్న నాయిని నర్సింహమూర్తి అట్లాంటిజనియం దేశానికి చెందిన 25 వేల రూపాయల విలువ చేసే బంగారు నాణాన్ని సాలార్‌జంగ్ మ్యూజియంకు బహుకరించడం పట్ల ఆయన అభినందించారు. మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.కె.వి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ సాలార్‌జంగ్ మ్యూజియం వ్యవస్థాపకుడు మూడవ సాలార్‌జంగ్ దేశ విదేశాల నుంచి 44 వేల కళాఖండాలు సేకరించారని, ఆ కళాఖండాలను మ్యూజియంలోని గ్యాలరీలలో సందర్శకుల సౌకర్యార్థం నెలకొల్పినట్లు తెలిపారు. నాణాలు చరిత్రకు ఆధారం అని రాష్ట్రంలోని స్టేట్ మ్యూజియంలో ఎన్నో నాణాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతనగరానికి చెందిన అమృతకుమార్‌జైన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.